# మానవ వికాస వేదిక
# 3వ రాష్ట్ర మహాసభలు
## మరియు
# హ్యూమనిస్ట్ సెంటర్ ప్రారంభోత్సవం

**వేదిక : హ్యూమనిస్ట్ సెంటర్, బాటసింగారం (గ్రామం), రామోజీ ఫిల్మ్ సిటీ, మౌంట్ ఒపేరా ల దగ్గర, (హైదరాబాద్-విజయవాడ హైవే) హైదరాబాద్.**

**సమయం: 2010 డిసెంబర్ 25, 26 తేదీలు**

మిత్రులారా!

ఈ ప్రపంచానికి మనిషినే కేంద్రంగా నిలిపి, భౌతికాతీత శక్తులేవీ మానవ జీవితాన్ని, శాసించటం లేదని చాటుతున్న ఆధునిక సిద్ధాంతం మానవవాదం(హ్యూమనిజం). మానవుని వికాసమే ధ్యేయంగా సైన్సు పరిశోధనలు, ప్రభుత్వాల ప్రణాళికలు, పరిపాలనలు సాగాలని, మానవవాదం కోరుతుంది. సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో ప్రజాస్వామిక విలువల పెంపుదలకోసం మానవవాదం కృషి చేస్తున్నది. మానవ సమైక్యతను అడ్డుకునే కులతత్వాన్ని, భావదాస్యాన్ని పెంచే మతతత్వాన్ని, ప్రజల మనోవికాసాన్ని అడ్డగించే మూఢత్వాన్ని సమూలంగా తొలగించాలని మానవవాదం ప్రబోధిస్తుంది. మానవవాద మార్గంలో పయనించే సంస్థ మానవ వికాస వేదిక.

2004 సెప్టెంబర్ 12న ఏర్పడిన ఈ సంస్థ 2005 జనవరిలో తొలి మహాసభల్ని, 2008 జనవరిలో మలి మహాసభల్ని జరుపుకొని, 2010 డిసెంబర్‌లో మూడవ రాష్ట్ర మహాసభల్ని జరుపుకునేందుకు సమాయత్తమవుతున్నది.

ఆరేళ్ళకాలంలో, మానవ వికాస వేదిక పలు సామాజిక చైతన్య కార్యక్రమాల్ని చేపట్టింది. ప్రజల్లో సైన్సు ప్రచారానికై ఉద్దేశించిన 'సైన్సు ఉత్సవాలు', విద్యార్థుల్లోని భౌతిక శాస్త్ర, గణితశాస్త్ర ప్రతిభను వెలికి తీసేందుకు 'సైన్సు ప్రతిభా పరీక్షలను' నిర్వహించింది.

కులం, మతం, భాష, జాతి వంటి సంకుచిత సరిహద్దులతో విడిపోయి పరస్పర అసహనంతో ఉండే ప్రజానీకానికి సమైక్యతా మధురిమను చవిచూపేందుకు ఉద్దేశించిన రాష్ట్రస్థాయి కుటుంబమేళా కార్యక్రమాలను నిర్వహించింది. అలాగే కులమత రహిత సమాజాన్ని కోరే యువజంటలను ఏకం చేసేందుకు 'నవతరం' పెళ్ళిళ్ళను జరిపించింది.

మానవ వికాన వేదిక (మా.వి.వే.) మూఢత్వానికి విరోధి. మూఢనమ్మకాలను, మూఢాచారాలను ఆశ్రయించి, వాటితో ప్రజలను మభ్యపరుస్తూ, తమ స్వప్రయోజనాలను సాధించగోరే దగాకోరుల దుస్తంత్రాలను పలుమార్లు ఎండగట్టింది. వాస్తు, జ్యోతిష్యం వంటి అశాస్త్రీయ ఆలోచనలపైన, వాటిని వ్యాపారం చేసుకుని, అసత్యాలను అమ్ముకుంటూ ప్రజల అజ్ఞానాన్ని సొమ్ముచేసుకుంటున్న మోసగాళ్ళపైన మీడియాలోనూ, ప్రజావేదికలపైన తనపోరాట శంఖాన్ని పూరించింది.